క్లుప్తంగా

విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి

అక్కిరెడ్డిపాలెం: బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రసన్న గిరిపై కొలువుదీరిన ప్రసన్న వేంకటేశ్వరుడు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

సీఎం దృష్టికి ప్రైవేట్ పాఠశాలల సమస్యలు



ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న అప్సా ప్రతినిధులు

గాజువాక : ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏపీ ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఎంను కలిసిన అప్సా ప్రతినిధులు పాఠశాలల నిర్వహణలో ఇబ్బందులను వివరించారు. పాఠశాలల రెన్యువల్స్ విషయంలో రిజిస్టర్డ్ లీజ్‌డీడ్‌కు బదులుగా అగ్రిమెంట్ కాపీని అంగీకరించాలని, విద్యుత్ కనెక్షన్లను కేటగిరీ 2 నుంచి కేటగిరీ 7కు మార్చాలని, ఫైర్ ఎన్‌వోసీ విషయంలో భవనం ఎత్తును 15 మీటర్ల వరకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా ట్రిపుల్ ఐటీల్లో సీట్లు కేటాయించాలని, ప్రతిభా అవార్డులకు అర్హత కల్పించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో అప్సా నాయకులు ఎం.జనార్దన్, సుబ్రమణ్యరాజు, టి.సింహాచలం, పి.భాస్కరరావు, కె.వి.అప్పలనాయుడు, గణపతిరావు తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికులకు పనిముట్లు ఇవ్వాలి

గాజువాక : జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు పూర్తిస్థాయిలో పనిముట్లు ఇవ్వాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జోన్–6 ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు డిమాండ్ చేశారు. 70వ వార్డు పారిశుధ్య కార్మికులు, నైట్ ప్యాకేజీ కార్మికుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షంలోనూ పారిశుధ్య పని మెరుగుపడాలంటే కార్మికులకు రెయిన్ కోట్లు ఇవ్వాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ నగరానికి మొదటి స్థానం సాధించడం కోసం కార్మికులకు పనిముట్లు, సేఫ్టీ పరికరాలు, సబ్బులు, కొబ్బరి నూనె, గమ్‌బూట్లు, చవ్వాకులు, పారలు, తోపుడు బళ్లను సరఫరా చేయాలన్నారు. బదిలీ కార్మికుల పేర్లను రిజిస్టర్లలో నమోదు చేయాలని, జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు మస్టర్ ఆఫీస్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.కిరీటం, బలరాజు, విజయ్, చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

సిరుల తల్లి సన్నిధిలో శ్రావణలక్ష్మీ పూజలు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.

రేపటి నుంచి ప్రారంభం

ఈ నెల 5వ తేదీ ఉదయం 8.20 గంటలకు శ్రావణలక్ష్మీ పూజలు ప్రారంభమవుతాయని ఈవో తెలిపారు. నెల రోజుల పాటు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్ర వారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూజలో పాల్గొన్న భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే సమకూరుస్తుందని తెలిపారు. వివరాలకు 0891–2568645, 2566515, నంబర్లలో సంప్రదించవచ్చని తెలియజేశారు.

స్నేహితుల సేవానిరతి

- సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న మిత్రబృందాలు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు (ఫైల్)

నిజమైన మిత్రుడెవరో తెలిసేది కష్టకాలంలోనే అన్నారు మహాత్మాగాంధీ.. మనిషిని అవసరంలో ఆదుకున్న మిత్రుడి **కన్నా ప్రియమైనది ఏదీ ఉండదంటారు గురునానక్..** ఇది నిజమేనని నిదర్శనంగా చూపిస్తాయి ప్రతీ ఒక్కరి జీవితం **లోనూ ఎన్నో అనుభవాలు.. కష్టసుఖాల్లో నేనున్నాననే** భరోసా ఇస్తూ.. రక్తసంబంధాన్ని మించిన స్నేహసుగంధాన్ని **అందిస్తూ ఆత్మీయహస్తాన్ని అందించే మిత్రులున్న వారే** నిజమైన సంపన్నులు. అయితే, జీవితంలో ప్రతీ దశలో ఎం**దరో పరిచయమవుతూ స్నేహహస్తం అందించినా** చిన్ననాటి స్నేహబంధం మాత్రం ఎప్పటికీ వాడని సుగంధమే. ఆ **బంధాన్ని కాపాడుకుంటూ బాల్య స్నేహితులంతా ఒకచోట** చేరితే అంతకు మించిన అ'పూర్వ' సమ్మేళనం ఏముంటుంది? మరో అడుగు ముందుకేసి ఆ మిత్రబృందాలు సామాజిక సేవలోనూ మేముసైతం అంటూ సేవలందిస్తుంటే చూడ ముచ్చటగా అనిపిస్తుంది. అటువంటి కొందరి స్నేహితుల సేవానిరతి.. స్నేహితుల దినోత్సవం సందర్భంగా..



కరోనాతో చనిపోయిన మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నడుపూరు పాఠశాల పూర్వ విదార్థులు (ఫైల్)

గాజువాక : గాజువాక ప్రాంతంలో గుండె జబ్బుతో బాధ పడుతున్న 20ఏళ్ల యువకుడికి వైద్యులు ఆపరేషన్ చేయాలన్నారు. అన్నీ సిద్ధమైన నేపథ్యంలో ఆపరేషన్ కోసం ఏబీ పాజిటివ్ రక్తం లేకపోవడంతో ఆ యువకుడి తల్లిదండ్రులు ఆందోళనలో పడ్డారు. రక్తం ఇచ్చేవారి కోసం అన్వేషించారు. స్థానిక సనత్ నగర్‌కు చెందిన యువకులకు ఆ విషయం తెలిసింది. జాగరపు శ్రీను అనే వ్యక్తి తన స్నేహితుల్లో ఏబీ పాజిటివ్ బ్లడ్ ఉన్నవారిని గుర్తించి రక్తం ఇవ్వాలని ప్రోత్సహించాడు. ఆ యువకుడి ప్రాణాలను నిలబెట్టారు. యువకుడి తల్లిదండ్రుల కళ్లలో ఆనందాన్ని చూసిన స్నేహితులు ఏకంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి వీలైనంత ఎక్కువమందికి రక్తం అందించాలని నిర్ణయించుకున్నారు. స్నేహితులందరూ కలిసి మహాత్మా, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు.

2012 జులై 22న తొలిసారిగా లైవ్ బ్లడ్ ఇచ్చిన తరువాత ఏర్పాటైన ట్రస్టు ఆధ్వర్యంలో ఈ శిబిరాలను విజయవంతం చేస్తున్నారు. 20 మందితో కలిసి ఏర్పాటు చేసిన ట్రస్టు సభ్యుల సంఖ్య ఇప్పటికి 50 మందికి విస్తరించింది. మిత్రులందరూ ఒక్క మాటగా ముందుకు సాగుతూ ఇప్పటివరకు నిర్వహించిన రక్తదాన శిబిరాలద్వారా 2500 మందితో రక్తదానం చేయించారు. మరో 400 మందికి లైవ్‌బ్లడ్ ఇచ్చారు.

ఊరికి ఉపకారం...

మహాత్మా, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు సభ్యులు కేవలం రక్తదానాలకే పరిమితం కాకుండా సామాజిక, ఆధ్యాత్మిక సేవలను సైతం నిర్వహించి పలువురి అభినందనలను అందుకొంటున్నారు. 73వ వార్డు పరిధిలోకి వచ్చే సనత్‌నగర్ కాలనీలో సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేవరకు పని చేస్తున్నారు. అందులో భాగంగా కాలనీలో శిథిలమైన కల్వర్టుల మరమ్మతులు, విద్యుద్దీపాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తుంటారు. మొక్కలు నాటడం, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, వైద్య శిబిరాల నిర్వహణ, వితరణ కార్యక్రమాలు, ఆపదలో ఉన్నవారికి సహాయపడటం వంటి కార్యక్రమాలతో స్థానికుల ప్రశంసలు అందుకొంటున్నారు. స్నేహితుల సహకారంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయగలుగుతున్నామని, వాటిని మరింత ముమ్మరంగా కొనసాగిస్తామని ట్రస్టు అధ్యక్షుడు జాగరపు శ్రీను తెలిపారు.

ఆపద వేళ అండగా..



గాజువాక ఉన్నత పాఠశాలకు ఫ్యాన్లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు (ఫైల్)

పెదగంట్యాడ: 'నీ స్నేహితులు ఎవరో చెప్పు.. నీవెవరో నేను చెబుతా' అన్న సామెత తరచూ వింటాం .. కానీ ఈ స్నేహితులు మాత్రం నీ సమస్య ఏంటో చెప్పు.. ఎలా పరిష్కరించాలో మేం చెబుతాం అంటున్నారు. బిందువులన్నీ కలసి సింధువైనట్లు స్నేహితులంతా కలసి సమాజ హితులుగా మారారు. సేవల్లో ముందుంటున్నారు.

గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–87 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సేవా సంకల్పంతో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అప్పట్లో వీరితో చదువుకున్న సుమారు 60 మంది పూర్వ విద్యార్థుల ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్నారు. తోటి మిత్రులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. మిత్రులతో పాటుగా ఇతరులకు ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తున్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ లిస్ట్ పెట్టుకుని ఆపద వేళల్లో అవసరం ఉన్నవారికి రక్తం ఇస్తున్నారు. జాతీయ పర్వదినాలు, పుట్టినరోజు వేడుకల్లో అనాథాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు వెళ్లి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలకు సంబంధించి ఏమైనా అవసరాలు ఉంటే ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకుని సహకారం అందిస్తున్నారు. అలా కులుకూరి మంగరాజు అనే పూర్వ విద్యార్థి తండ్రి జ్ఞాపకార్థం పాఠశాల ముఖద్వారం వద్ద సరస్వతీ దేవి విగ్రహాన్ని కట్టించారు. అలాగే ఎవరికైనా ఏ సమస్య అయినా తమ దృష్టికి తీసుకువస్తే పూర్వ విద్యార్థుల బృందం కులుకూరి మంగరాజు, కంబాల శంకర్రావు, గంధం శ్రీనివాసరావు, గూడూరి శంకర్రావు, హరి, విజయలక్ష్మి, రమణ, నాగేశ్వరరావు, ప్రసాద్, మిత్ర బృందానికి తెలియజేస్తున్నారు. వారికి సహాయసహకారాలు అందిస్తున్నారు.

అనాథలకు ఆప్త బంధువులై..



అనాథ బాలలకు లంచ్‌బాక్సులు అందజేస్తున్న నడుపూరు పాఠశాల పూర్వ విద్యార్థులు (ఫైల్)

పెదగంట్యాడ: 1998–99 బ్యాచ్ నడుపూరు పూర్వ విద్యార్థులు సేవాకార్యక్రమాల్లో ముందుంటున్నారు. శిరశెట్టి వెంకటశివ అప్పారావు, పట్టా పైడిరెడ్డి, కిలాన రవి, నమ్మి అప్పలనాయుడు, సారిపిల్లి శ్రీను, మొల్లి వెంకటరమణ, దల్లి గోవిందరెడ్డి, పెదపూడి వాసు, భగవతి వెంకటరమణ, గొందేశి తాతారావు, యరబాల రాంబాబు సహమిత్రులు కలిసి ఒక బృందంగా ఏర్పడి తోటి మిత్రులకు ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తున్నారు. అనాథాశ్రమాలకు నిత్యావసర సరకులు అందించడం, అభాగ్యులను ఆదుకోవడం, ప్రమాదంలో గాయపడిన వారికి రక్తదానం చేయడం వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు.



పేద మహిళలకు సహాయం చేస్తున్న యువకులు (ఫైల్)

ఉక్కు పరిరక్షణకు ట్యాక్స్ హాలీడే ప్రకటించాలి

- స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల విజ్ఞప్తి
- 1269వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సిటూ నాయకుడు రామారావు

అగనంపూడి: కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిరక్షణకు ట్యాక్స్ హాలీడే ప్రకటించాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు ఎస్.రామారావు, జె.అయోధ్యరామ్ కోరారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో 1269వ రోజు కార్యక్రమంలో వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడపాలంటే ఎన్ఎండీసీతో మాట్లాడి ఐరన్ ఓర్, కోల్ ఇండియాతో చర్చించి కోల్‌ను సరఫరా చేయాలన్నారు. తక్షణ సాయంగా రూ.3100 కోట్లు లెటర్ ఆఫ్ కరస్పాండెన్స్ వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సారథ్యంలో నిర్మాణంలో ఉన్న అమరావతి, పోలవరంతో పాటు ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికి విశాఖ స్టీల్‌ను కొనుగోలు చేసేలా చొరవ తీసుకోవాలన్నారు. వర్కింగ్ క్యాపిటల్ లేకపోవడం వల్ల ఉత్పత్తికి విఘాతం కలిగి ఉక్కు నష్టాల్లోకి నెట్టబడుతోందన్నారు. ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తామని ప్రకటించినప్పటి నుంచి పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. దీని నుంచి బయటపడేందుకు అన్నివిధాలా సహకారం అందించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వై.టి.దాస్, పెదిరెడ్ల నీలకంఠం, దేముడు నాయుడు, ఎ.శ్రీనివాస్, కృష్ణమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, రామన్న తదితరులు మాట్లాడారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలని సీఎంకు వినతి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ చంద్రబాబుకు స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుత పరిస్థితులను వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. ఈ సమస్యపై ప్రధాని మోదీ వద్దకు పోరాట కమిటీ నాయకులను తీసుకువెళ్లే అవకాశం కల్పించాలన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, సిహెచ్. నర్సింగరావు, కె.ఎస్.ఎన్.రావు, దొమ్మేటి అప్పారావు తదితరులున్నారు.

సంజీవరావు సేవలు నిరుపమానం



ఉద్యోగ విరమణ చేసిన సంజీవరావును సత్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: చిత్తశుద్ధి, అంకితభావం గల అధికారులలో కె.సంజీవరావు ముఖ్యులని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ఆయన సేవలు నిరుపమానమని కొనియాడారు. ఉద్యోగ విరమణ చేసిన జీఎం హెచ్ఆర్ కె.సంజీవరావును స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో సత్కరించారు. సభలో అయోధ్యరామ్ మాట్లాడుతూ కార్మికుల అభ్యున్నతికి అవసరమైన సూచనలను, సలహాలను సంజీవరావు అందించేవారన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షులు వై.టి.దాస్, ఓబీసీ నాయకుడు బి.అప్పారావు, ఎస్సీ, ఎస్టీ నాయకుడు బి.తౌడన్న మాట్లాడుతూ స్టీల్ కార్మికులకు రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తూ వారికి హక్కులు, బాధ్యతలను తెలియచేయడంలో సంజీవరావు ప్రధాన భూమిక వహించారన్నారు. కార్మిక నాయకులు రామ్మోహన్‌కుమార్, జి.ఆర్.కె.నాయుడు, శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్ఎంఎంఎస్'కు 27మంది ఎంపిక అభినందనీయం

- అనకాపల్లి జిల్లా ప్రొటోకాల్ అధికారి సన్యాసినాయుడు
- ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జబర్దస్త్ ఫేం సత్తిపండు, హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్

పెదగంట్యాడ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ఫలితాల్లో తొలి 8 ర్యాంకులు సాధించడం అభినందనీయమని అనకాపల్లి జిల్లా ప్రొటోకాల్ అధికారి ఆడారి వెంకట సన్యాసినాయుడు అన్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో 27 మంది ఈ స్కాలర్‌షిప్ టెస్టుకు ఎంపిక కావడంతో పాఠశాల ఆవరణలో శనివారం అభినందన సభ నిర్వహించారు. జబర్దస్త్ ఫేం సత్తిపండు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన వనరులు ఈ పాఠశాలలో ఉన్నాయన్నారు. అలాగే ఉపాధ్యాయుల కృషి కూడా ఎనలేనిదని కొనియాడారు. జిల్లా స్థాయిలో వరుసగా మూడేళ్ల ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్‌ను, ఉపాధ్యాయులను అభినందించారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు పలకా మాధవి, నారాయణరావు, సత్యారావు, కిరణ్, షేక్ బాబ్జీ, సుకేశిని, పలకా శ్రీదేవిని సత్కరించారు.

ఆస్తిపన్ను వసూలు వేగవంతం

అడ్మిన్ సెక్రటరీలకు జెడ్సీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ సన్యాసినాయుడు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్‌లో ఆస్తి పన్నుల వసూలును వేగవంతం చేయాలని జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. జోనల్ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ తమ పరిధిలోని నివాసాలకు పూర్తిస్థాయి పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. పన్నుల వసూలుతో పాటు ఇంటింటికీ సర్వే చేయాలని, ఇప్పటివరకు ఆస్తి పన్ను లేని ఇళ్లకు పన్నులను విధించాలన్నారు. తక్కువ ఆస్తి పన్ను ఉన్న అసెస్‌మెంట్లను సమీక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గాజువాక జోనల్ సహాయ కమిషనర్ సీహెచ్.రామనారాయణ, ఆర్ఐలు రెడ్డి మోహన్, సుభాన్, శివ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద స్మరణ



తిరుమలేశునికి పూజలు చేస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. స్వామికి తోమాల సేవ, సుప్రభాత సేవలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు వివిధ రకాల పుష్పాలతో బేడా ప్రదక్షిణ చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలేశుని విశేష పుష్పాలతో అలంకరించారు. అనంతరం నక్షత్ర హారతి ఇచ్చారు.

వేగవంతంగా ప్రసాద్ పథకం పనులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. ఈ పనులను శనివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, టూరిజం, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. కొండదిగువ పుష్కరిణీసత్రం, కల్యాణమండపం, ఘాట్‌రోడ్డులో వైజంక్షన్, క్యూకాంప్లెక్స్, యాంపీ థియేటర్, అన్నప్రసాద వితరణ భవనంలో కోల్డ్ స్టోరేజీ పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. ఆయా పనులకు సంబంధించి రూపొందించిన ప్రణాళికను సింహగిరిపై ఆనంద నిలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. టూరిజంశాఖ ఈఈ రమణ, దేవస్థానం ఈఈలు, ఏఈ పాల్గొన్నారు. అంతకు ముందు స్వామిని కమిషనర్ సతీ సమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు.

నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



లైఫ్‌గార్డ్స్ కాపాడిన పర్యాటకులు

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో నలుగురు మునిగిపోతుండగా లైఫ్‌గార్డ్స్ ప్రాణాలు కాపాడారు. విజయనగరం జిల్లా గరివిడి ప్రాంతానికి చెందిన ఓ కుటుంబానికి చెందిన 15 మంది శనివారం మధ్యాహ్నం సరదాగా గడిపేందుకు ఇక్కడ బీచ్‌కు చేరుకున్నారు. బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో తోలాడ గొల్లబాబు, కళ్యాణ కీర్తన, శోభ, కరిశెట్టి శాంతి కుమారి మునిగిపోయారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ సతీష్, నూకరాజు, ఎం.చందు, డి.కార్తీక్, ఎం.అమ్మోరు, కె.రాజు వీరిని గమనించి సురక్షితంగా తీరానికి తీసుకుని వచ్చారు. ప్రాణాపాయం తప్పడంతో కుటుంబ సభ్యులంతా ఊపిరి పీల్చుకున్నారు.

తల్లిపాలు బిడ్డలకు శ్రేష్టం

- వాడవాడలా అవగాహన కార్యక్రమాలు



ప్రియదర్శిని కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: తల్లిపాలు బిడ్డలకు శ్రేష్టమని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

– 65వ వార్డు ప్రియదర్శినీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, పి.పద్మావతి, ఎంపీ లక్ష్మీకుమారి, బి.కళావల్లి, వెంకటలక్ష్మి, పుష్ప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పెందుర్తి పెదగంట్యాడ సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. నెల్లిముక్కు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల విశిష్టతను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వేణుశ్రీ, విజయలక్ష్మి, వరలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.
- జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని రెడ్డి ముసలినాయుడపాలెం, దుర్గవానిపాలెం, నడుపూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్లాంపేట సెక్టార్ సూపర్‌వైజర్ కె.లక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యారోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో బుజ్జి, సుజాత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగనంపూడి: తల్లిపాలల్లో శ్రేష్టతను వివరించి, తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాలని ఉక్కు కార్మిక సంఘం నాయకుడు ఎం.వి.రమణ అన్నారు. అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రెడ్డిముసలినాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద మానవహారంగా ఏర్పడిన సిబ్బంది



నెల్లిముక్కు అంగన్‌వాడీ కేంద్రంలో..



పెదమడక అంగన్‌వాడీ కేంద్రం వద్ద ..